లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కథలాపూర్, మే5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేటలో సోమవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం కన్నుల పండవగా నిర్వహించారు. ఊశకోల రవిపంతులు నేతృత్వంలో కళ్యాణం జరపగా భక్తులు కనులారా వీక్షించారు. చుట్టు పక్కన గ్రామాల నుంచి భక్తులు కళ్యాణం చూసేందుకు తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బుర్రి వంశీయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పెగడపల్లిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

7

ఎస్సెస్సీ మార్కుల పునఃపరిశీలనకు అవకాశం

- రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు చాన్స్
- దరఖాస్తుకు ఈనెల 15 వరకు గడువు

7

'సమస్యల పరిష్కారానికి చర్యలు'

జగిత్యాల అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యాక్రమంలో 10 మంది అర్జీలు పెట్టుకున్నారు. వచ్చిన వారందరితో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి సంబదిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పూర్తి వివరాటు సమర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే విదంగా కృషి చేస్తున్నామని అన్నారు.

వృద్ధులను వేధిస్తే చర్యలు

వృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ సినియర్ సిటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన వృద్ధుల సంరక్షణ చట్టం వాల్ పోస్టర్‌లను, స్టిక్కర్‌లను ఆవిష్కరించారు. సీనియర్ సిటీజన్స్ రక్షణకు మరింత ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న సీనియర్ సిటీజన్స్ నాయకతాన్ని ఎస్పీ అబినందించారు.

ఊరూరా నిఘా కమిటీలు

- ఉపాధిహామీ పనుల్లో అక్రమాల అడ్డుకట్టకు చర్యలు
- ఐదుగురితో కమిటీ ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



జిల్లాలో ఈజీఎస్ వివరాలు ఇలా..	
జాబ్ కార్డుల సంఖ్య	1.67 లక్షలు
మొత్తం కూలీలు	2.73 లక్షలు
శ్రమ శక్తి సంఘాల్లో ఉన్న కుటుంబాల సంఖ్య	1.05 లక్షలు
శ్రమశక్తి సంఘాల్లో ఉన్న కూలీల సంఖ్య	1.46 లక్షలు

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం ఊరూరా నిఘా కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఉతర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పలు చోట్ల నిబంధనలు ఉల్లంఘిస్తున్న విషయాన్ని గుర్తించిన కేంద్రం ప్రభుత్వం ఈ ఏడాది పనిదినాల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు.

● పేరుకే సామాజిక తనిఖీలు..

జిల్లాలో 2.73 లక్షలకు పైగా కూలీలు ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఈజీఎస్ పనుల్లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరపడిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏటా జరిగిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించి పలు అవకత వకలు జరిగినట్లు నిర్ధారణ అవుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం నామమాత్రపు రికవరీతో సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. సమస్య గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పనుల్లో మార్గదర్శకాలు పాటించడం లేదంటూ పనిదినాల్లో కోత విధించడం మొదలు పెట్టింది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఊరిలో ఐదుగురితో కూడిన నిఘా కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

● వారానికోసారి పరిశీలన

ఉపాధి పనులను కమిటీలు వారానికోసారి పరిశీలించి పనులు జరుగుతున్న తీరు, మంజూరు, కూలీల హాజరు, చెల్లింపులు తదితర వివరాలను గుర్తించి మండ ల పరిషత్ అధికారులకు వివరాలు అంద జేస్తారు. మండల అధికారులు జిల్లా అధికారుల కు, కలెక్టర్‌కు నివేదిస్తారు. ఇక నుంచి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సామాజిక తని ఖీలు నిర్వహించనున్నారు. ప్రతినెలా మొ దటి వారంలో తనిఖీలు నిర్వహించాలని, పనుల వివరాలను అందజేయాలని ఆదేశా లు జారీ అయ్యాయి. అలాగే తనిఖీల్లో వెల్లడైన రికవరీ నిధులను తాత్సారం చేయకుండా రాబట్టాలని తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది.

●గ్రామస్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలు

కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు పారదర్శకంగా ఉండే కమిటీల నియామకం చేయడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు. గ్రామ స్థాయిలోనే అవినీతికి చెక్ పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఇకపై జిల్లాలో గ్రామస్థాయిలో విలేజ్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసే విలేజ్ కమిటీలలో ఎవరెవరిని సభ్యులుగా చేర్చుకోవాలి అనే విషయమై దృష్టి సారించారు. దీని ప్రకారం ఐదుగురు సభ్యులను విలేజ్ మానిటరింగ్ కమిటీలో ..

మిగతా 8లో

వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

జగిత్యాల అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలో సోమవారం ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన చేశారు. ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వివిధ కాలనీల నుంచి తరలి వచ్చిన ముస్లింలు సమూహంగా ఏర్పాడి జమా మాసీదు నుంచి తీన్ ఖని మీదుగా టవర్ సర్కిల్, కొత్త బస్టాండ్ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయంకు చేరుకుని అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రాన్ని సమర్పించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ముఫ్తీ యునిస్ ఖాన్, అబ్దుల్ బారీ, జమాతే ఇస్లామియ ప్రెసిడెంట్ ఇమాద్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎండాకాలం తగిన జాగ్రత్తలు తీసుకొని వడదెబ్బ నుంచి రక్షించుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం స్థానిక ఐడిఓసీ కార్యాలయంలో నేషనల్ ప్రోగ్రాం ఫర్ క్లైమేట్ చేంజ్ ఆన్ హ్యూమన్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చినటువంటి పోస్టర్స్, కరపత్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రజలు తప్పని సరి పరిస్థితుల్లో మాత్రమే మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లాలని తెలిపారు. మంచినీరు ఎక్కువగా తాగి డీహైడ్రే షన్ కాకుండా కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అర్చన, జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్, డిఆర్‌డిఓ రఘువరన్ పాల్గొన్నారు.

'ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి'



మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, మే5 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తుదముట్టించాలంటే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలని, దానికి ఇదే సరైన సమయమని అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా దేశ ప్రజలందరు ఖండించడం హర్షించ దగ్గ విషమన్నారు. 50 సంవత్సరాల క్రితం ఇందిరాగాంధీ పాకిస్తాన్ మెడలు వంచితే ఇప్పటికి కోలుకోలేదన్నారు. నక్సలైట్ల సమస్య అంతర్గతమని దానిని ఎప్పుడైనా పరిష్కరించే అవకాశం ఉన్నదన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేసి ఆదివాసీల హక్కుల పరిరక్షణకు వారితో శాంతి చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, టిపిసిసి అధికార ప్రతినిధి బండ శంకర్, కండ్లెపల్లి దుర్గయ్య, జున్ను రాజేందర్, చందా రాధ కిషన్, గాజుల రాజెందర్, గుగ్గిల హరీష్, కచ్చు హరీష్, శీలం సురెం దర్, గుండా మధు, ధర రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక రంగంలో భారత్‌దే అగ్ర స్థానం

జగిత్యాల అర్బన్, మే (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలం నుంచి శాస్త్ర సాకేతిక రంగాల్లో భారతదేశమే అగ్రగామిగా ఉండేదని ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సంఘ సంచాలక్ డాక్టర్ భీమనాత్ని శంకర్ అన్నారు. జగిత్యాల వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంపూటర్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంబించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో మేధో సంపదకు కొదవ లేదని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వాల్మీకి ఆవాసం అధ్యక్షులు జడిగే పురుషోత్తం, పోటగిరి అరవింద్, నందెల్లి మదన్‌మోహన్, సంపూర్ణచారి, బెక్కం మల్లేశం పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఎస్ఆర్ ఎస్పీ క్యాంపు శివారులో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను సందర్శించి పరిశీలన జరిపారు. ప్రతీ నెల చేసే తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను కలెక్టర్ సందర్శించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈవీఎంల భద్రత పరిశీ లించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూ దన్, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల విభాగం అధికారి హకీం తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలి

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి సారించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పోతారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం చేపట్టింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం మరియు సంబంధిత విషయాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వ్యవసాయంలో రైతులు భూసార పరీక్షలు చేయకపోవడంతో పంట దిగుబడిపై ప్రభావం చూసుతుందని రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని అధిక దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచలను పాటించాలని ఆయన ఈసందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ శ్రీలత, నాయకులు కోల శ్రీనివాస్, గుర్రాల రాజేందరఃరెడ్డి, సొల్లు సురేందర్, సుధాకర్‌రావు, డిల్లీ రామరావు, కోల నర్సింహరెడ్డి, జలపతి, మల్లేష్ యాదవ్, ఏడీ సాయిద నాయక్, డీఏవో భాస్కర్ ఏవో ప్రదీప్‌రెడ్డి, ఏడీఏ తిరుపతి నాయక్, తిరుపెల్లి రాజయ్య, స్వామి, నర్సింగం, పలువురు రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో స్వల్పంగా భూకంపం

- పలు ప్రాంతాల్లో 3 సెకన్ల పాటు ప్రకంపనలు
- భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన జనం
- భీమారంలో కూలిన పాత ఇల్లు



కోరుట్లలో భయంతో రోడ్డుపైకి వచ్చిన జనం



జగిత్యాలలో బయటకు వచ్చిన మున్సిపల్ కమిషనర్



భీమారంలో కూలిన పాత ఇల్లు

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూకంపం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలతో పాటు పలు మండలాలు, గ్రామాల్లో సాయంత్రం 6.47 గంటలకు భూమి స్వల్పంగా ప్రకంపించింది. సుమారు 3.5 సెకన్లపాటు భూ ప్రకంపన కొనసాగింది. దీంతో జనం భయంతో ఇళ్లలోంచి రోడ్లమీదికి వచ్చారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో భూకంపం కారణంగా ఫైళ్లు, టేబుళ్లు కదలడంతో కమిషనర్ స్పందనతో పాటు ఉద్యోగులు బయటకు రహదారిపైకి వచ్చి ఏమి జరిగిందని ఆరా తీశారు. కాగా రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 3.9 నమోదైనట్లు తెలుస్తోంది.

●జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో సోమవారం భూమి కంపించింది. గోడలకు స్వల్పంగా పగుళ్లు వచ్చాయి.

●కోరుట్ల/కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం సాయత్రం సమయంలో భూమి రెండు మార్లు కంపించింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

●మెట్‌పల్లిటౌన్: పట్టణంతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం భూ ప్రకంపనలు సంభవించాయి. 2 నుండి 3 సెకన్ల పాటు భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు.

●మెట్‌పల్లి రూరల్: మండలంలోని గ్రామాల్లో సోమవారం సాయంత్రం భూ ప్రకంపనలు సంభవించింది. గ్రామాల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

●భీమారం: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం 6:46 గంటలకు స్వల్ప భూకంపం సంభవించింది. మండల కేంద్రంలోని హనుమాన్ వాడకు చెందిన పల్లి భూదేవికి చెందిన పాత ఇల్లు స్వల్పంగా కూలిపోయింది.

●మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు మొగిలిపేట, గుండంపల్లితో పాటు తదితర గ్రామాల్లో సోమవారం భూమి కంపించి శబ్దం రావడంతో ప్రజలు భయందోళనతో బయటకు పరుగెత్తారు.

●ఎండపల్లి : మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం మూడు సెకండ్ల పాటు భూమి కంపించింది. ఎలాంటి నష్టం జరగలేదు.

●సారంగాపూర్: మండలంలో ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు ఒక్కసారిగా బయటకు వచ్చారు. 3 సెకన్ల పాటు పెద్ద శబ్దం రావడంతో ప్రజలు ఆందోళన చెందారు.

●కొడిమ్యాల: మండలంలోని వివిద గ్రామాల్లో సోమవారం సాయంత్రం 4సెకన్ల పాటు భూమి కంపించింది. ఇళ్లలోని వస్తువులు కదిలాయి. దీంతో ఏం జరుగుతుందోనని ప్రజలు ఇళ్ల నుంచి బయటకువచ్చారు.

●మల్యాల: మల్యాలతో పాటు పలు గ్రామాల్లో సోమవారం వచ్చిన భూప్రకంపనలు వచ్చాయి. ఇళ్లలోని వస్తువులు కదలడంతో పాటు నేలపై పడడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి రహదారుల పైకి పరుగులు పెట్టారు. కొన్ని చోట్ల గోడలు బీటలు వారినట్లు తెలిసింది.

●వెల్గటూర్: వెల్గటూర్‌లో సోమవారం సాయంత్రం 6.50 గంటలకు రెండు సెకండ్ల పాటు భూమి కంపించింది.

●గొల్లపల్లి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో కొద్ది సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

●రాయికల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం స్వల్ప భూకంపం ఏర్పడింది. దీంతో ప్రజలు తమ ఇళ్ల నుంచి భయాందోళనతో రోడ్లపైకి పరుగులు తీశారు.

నకిలీ మందులు అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆశన్నపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో నకిలీ మందులు అమ్ముతున్న కొంకటి రమేష్ అనే వ్యక్తిని సోమవారం గ్రామస్థులు పటుకున్నారు. ఈ విషయంపై మెడికల్ సిబ్బందికి సమాచారం అందించగా కూనారం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భావన ఆశన్నపల్లెలో మందులు పరిశీలించారు.డాక్టర్ భావన మాట్లాడుతూ ఆశన్నపల్లి గ్రామపంచాయతీలో సంజీవని నేషనల్‌కేర్ సెంటర్‌కు సంబంధించిన కొంకటి రమేష్ ఎక్స్‌పైరీ అయిపోయిన మందులను గ్రామస్థులకు అమ్ముతున్నాడని తెలిపారు. ఈ మందులు వాడటం వల్ల సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఉంటాయన్నారు.

గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి..

గ్రామకార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ మంద రమ వెంకన్న, గాజుల మోహన్, కూస రవి, ఎరుకల మల్లయ్య తదితరులు డాక్టర్‌కు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యదర్శి సంజీవ్ గ్రామంలో ఊరు చాటింపు వేయించి గ్రామపంచాయతీలోనే మెడికల్ క్యాంపు నిర్వహించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈమందులు ఇచ్చే అతను పరీక్షలకు 200రూపాయలు, మందులకు 1000 నుంచి 1200రూపాయలు వసూలు చేశాడని ఈవిషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేములవాడ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ, బస్సు ద్విచక్ర వాహం ఢీకొన్న సంఘటనలో ఒకవ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన రాజు తన ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళుతుండగా డివైడర్‌ను ఢీకొని ఎదురుగా సిరిసిల్ల నుంచి వేములవాడకు వస్తున్న బస్సుకు ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రాజుకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

జగిత్యాల అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కేంద్రంలో కొన్నిరోజుల క్రితం పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ రెండు రోజులజైలు శిక్ష విధించారు. కొన్నిరోజుల క్రితం పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా వరికొప్పుల పరషురాం అనే వ్యక్తి పట్టుబడగా పట్టణ ఇన్స్‌పెక్టర్ వెణుగోపాల్ అతనిని కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ రెండు రోజుల శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు..

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోండిలా



ఖోఖోతో వ్యాయామం

ఖోఖో ఆటలో పరిగెత్తడం ద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. ఆటలో క్రీడాకారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో మిత్రులతో స్నేహభావం పెరుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి ఈ గ్రామీణ క్రీడ ఎంతో దోహదపడుతుంది. వాలీబాల్ ఆటతో శరీరంలో అన్ని అవయవాలు కదులుతాయి. కాళ్లకు చేతి కండరాలకు పని చేప్పే ఆట. వాలీబాల్ అందరికి మంచి వ్యాయామాన్ని అందించే ఆట.

కంప్యూటర్ విద్య



నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్య తప్పనిసరిగా మారింది. దీని ప్రాధ్యాన్యాన్ని గుర్తించి వేసవిలో చిన్నారులకు కంప్యూటర్ పరిజ్ఞానం శిక్షణ పొందడానికి మంచి అవకాశం. ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకొనేందుకు కృషి చేస్తున్నారు.

గ్రామీణ ఆట కబడ్డీ

గ్రామీణ ఆటలలో కబడ్డీది ప్రత్యేక స్థానం. ఈ ఆటతో శరీరక ధృడత్వం పెరగడంతోపాటు రక్తప్రసరణ వృద్ధి చెందుతుంది. ఎముకలు బలపడుతాయి.

క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తుంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.

వేసవి సెలవులంటే పిల్లలకు చాలా ఇష్టం. పది నెలలుగా ప్రతి రోజు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులంతా ఆటలు ఆడుతూ పాటలు పడుతూ కాలక్షేపం చేస్తు ఆనందంగా గడుపుతారు. వివిధ రకాల ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఈత కోసం చెరువులు, బావుల దగ్గర హంగామా చేస్తారు. పట్టణాల్లో పిల్లలు స్విమ్మింగ్‌పూల్‌కు బాట పడుతున్నారు. నృత్యంలో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంత మంది పిల్లలు కంప్యూటర్ నేర్చుకుంటున్నారు. వేసవిలో చిన్నారులు నేర్చుకునే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

- చొప్పదండి,ఆంధ్రజ్యోతి

ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు శిక్షణ



ఇంగ్లీష్‌పై పట్టుకు ప్రయత్నం

ఉజ్వల భవిష్యత్‌కు ఇంగ్లీష్ భాష ప్రతి చిన్నారికి అవసరం. చదువుకునే కోర్సు, పోటీ పరీక్షలో రాణించేందుకు అవసరమైన ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవిలో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.

క్యారమ్స్‌తో ఏకాగ్రత

ఏకాగ్రతతో లక్ష్యాన్ని ఎలా గురి పెట్టాలో నేర్పేదే క్యారమ్స్. విద్యార్థులు వేసవిలో ఇంటి దగ్గర నేర్చుకోవచ్చు.దీనితో చదువులో ఏకాగ్రత పెరుగుతుంది.

మెదడుకు పని చెప్పే చదరంగం

విద్యార్థుల మేథస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైంది. ఈ ఆటతో విద్యార్థికి సమయస్ఫూర్తి, ఆలోచనాశక్తి సమస్యలను ఎలా పరిష్కరించాల్లో నేర్పుతుంది. ఇంటి వద్దనే విద్యార్థి శిక్షకుడి సహాయంతో నేర్చుకోవచ్చు.



క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తుంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.



డ్రాయింగ్ నేర్చుకోవడానికి చక్కని అవకాశం..

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చూసుకోవడానికి, తమలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడేవాటిలో పెయింటింగ్ ముఖ్యమైనదని ఉపాధ్యాయులు చెబుతుంటారు. విద్యార్థులు వాటిలో శిక్షణ తీసుకుని అద్భుతాలు సృష్టించడానికి చక్కని అవకాశం. విద్యార్థులు వివిధ రకాల బొమ్మలను తయారు చేయడంలో శిక్షణ పొందవచ్చు.



భార్యపై హత్యాయత్నం కేసులో భర్త రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సై రాజన్న

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసేందుకు యత్నించిన కేసులో భర్తను కరీంనగర్ పోలీసులు జైలుకు తరలించారు. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రాజన్న వివరాల ప్రకారం.. కరీంనగర్ సిఖ్‌వాడిలో గతనెల 18న తనభార్యను హత్య చేసేందుకు యత్నించిన అన్నమనేని కొమురయ్యను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సిఖ్‌వాడిలోని అమ్మ మెస్‌లో వంట పని చేస్తున్న భార్య వద్దకు వెళ్లిన ఆమె భర్త కొమురయ్య అక్కడే మెస్‌లో పొయ్యిపైన ఉన్న వేడికూరను ఆమెపై పోశాడు. దీంతో ఆమె ముఖం, ఛాతి, వీపుభాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. హోటల్ యజమాని వెంటనే 108లో ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కొమురయ్యపై కేసునమోదు చేశారు. భార్యపై కొమురయ్యకు అనుమానం ఉండేదని, గతంలో కొమురయ్యపై మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, దీంతో భార్యపై కక్ష పెంచుకొని హత్య చేసేందుకు యత్నించాడని ఎస్సై తెలిపారు.

డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లావిద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటుకళాశాలలో రెండుసంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ), డిప్లొమాఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఈ) మొదటి సంవత్సరం2025-26లో చేరుటకు నిర్వహించే డీఈఈసెట్2025 నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎల్‌ఎండీ కాలనీలోగల డైట్‌కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంమొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈకోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతంమార్కులు కల్గిఉండాలన్నారు. షెడ్యూల్ తెగలు, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతంమార్కులు కలిగి ఉండాలని తెలిపారు. సెప్టెంబరు1, 2025నాటికి అభ్యర్థుల వయస్సు 17సంవత్సరాలు, గరిష్ట వయోపరిమితి లేదనితెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్‌లోఈనెల15లోగా సమర్పించాలని తెలిపారు. ఈనెల25న ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. డీఎల్‌ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్లమాధ్యమాల్లో, డీపీఎస్‌ఈ కోర్సు మాత్రమే ఆంగ్లమాధ్యమంలో ఉంటుందని తెలిపారు. కోర్సును ఏ మాధ్యమంలో చేయదలిస్తే ఆమాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షరాయాలని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు డీఈఈ సెట్-2025 వెబ్‌సైట్ deecet.cdse. telangana.gov.in ను సందర్శించాలని తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



శారద (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామపరిధిలోగల జగ్గయ్యపల్లెకు చెందిన శారద(23) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కమాన్‌పూర్ మండలం జూలపల్లికి చెందిన శారదను ఏడుసంవత్సరాల క్రితం జగ్గయ్యపల్లెకు చెందిన ఉప్పుల అజయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆరునెలలుగా శారద మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో కరీంనగర్‌లోని వైద్యులకు చూపించారు. ఆదివారం రాత్రి ఇంటిముందు రేకుల షెడ్డులో శారద ఉరివేసుకుంది. సోమవారం ఉదయం భర్త అజయ్‌కుమార్ గమనించి శారద కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. శారద తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఓసీపీ-5లో ప్రమాదం: కాంట్రాక్టు కార్మికుడు మృతి

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఏరియా ఓసీపీ-5 ప్రాజెక్టులోని 1సీమ్ కోల్‌బెంచ్‌లో సోమవారం ట్యాంకర్ బోల్తా పడిన ప్రమాదంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్, బీహార్‌కు చెందిన వికాస్ కుమార్(34) మృతి చెందాడు. వికాస్ కుమార్ వీసీ పటేల్ కంపెనీలో పని చేస్తున్నాడు. బ్లాస్టింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్న వికాస్‌కుమార్ ఎక్స్‌ప్లోజివ్ ట్యాంకర్‌పై ఎక్కివస్తున్నాడు. ట్యాంకర్ బోల్తా పడుతుండగా తప్పించుకునేందుకు వికాస్ కిందకు దూకాడు. ట్యాంకర్ వెనుక టైరు అతనిపై నుంచి వెళ్లడంతో మృతి చెందాడు. టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

ఇల్లంతకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాలసాని ఆశాలు(86) అనే వృద్ధుడు క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఆశాలు బస్టాండు సమీపంలో దుకాణం నడుపుతుంటాడు. వారం రోజుల క్రితం దుకాణంలోకి ఓ బాలిక వచ్చిన సందర్భంగా చిన్న వివాదం జరిగింది. దీంతో బాలిక ఇంటికి వెళ్లి తన అక్కకు విషయం తెలిపింది. ఆ తర్వాత వృద్ధుడు తనను దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆశాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొంత సమయానికి ఇంటికి పంపించారు. దీంతో మనస్థాపం చెందిన ఆశాలు ఆదివారం ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రావడంతో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపామని తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఉంటున్న సిద్దిపేటలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆలకుంట గౌరమ్మ(34) కొత్తపల్లి చెరువులో పడి మృతిచెందగా మృతిపై అనుమానాలున్నాయని మృతురాలి సోదరుడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గౌరమ్మకు ఒక కూతురు ఉంది. ఆమెభర్త కొంతకాలం కిందట అనారోగ్యంతో మరణించాడు. అప్పటినుంచి తల్లి, కూతుళ్లు కూలీపని చేస్తూ జీవిస్తున్నారు. గౌరమ్మ అప్పడప్పుడు మద్యం తాగి కూతురుతో గొడవపడేది. ఈ క్రమంలోనే ఏడాదిన్నర కిందట గౌరమ్మ కూతురుకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొద్దిరోజుల కిందట గౌరమ్మ తన కూతురు వద్దకు మరో వ్యక్తితో వచ్చి తాము ఇద్దరం కలిసి ఉంటున్నట్లు చెప్పింది. కొత్తపల్లిలో పొన్న బాలాజీ అనేవ్యక్తితో గౌరమ్మ కలిసి ఉంటున్నట్లు మృతురాలి సోదరుడు తెలిపాడు. ఆదివారం సాయంత్రం బాలాజీ ఇంట్లో మద్యం తాగుతున్న సమయంలో గౌరమ్మ, మరోమహిళ గొడవపడినట్లు తెలిసిందని, బాలాజీ, మరోమహిళపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వడదెబ్బతో రైతు మృతి



గంగరాజం(ఫైల్)

మేడిపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన అత్తిని గంగరాజం(45) అనే రైతు వడదెబ్బతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. గంగరాజం రెండు రోజుల నుంచి వరి కోత పనులు చేయిస్తున్నాడు. దీంతో ఆదివారం ఎండదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం తెల్లావారుజామున గంగరాజం ఇంటిలో మృతిచెందాడు.

జీవాల ఎరువు.. పంటలకు మేలు

- భూసారం పెరిగేందుకు దోహదం
- పొలాల్లో గొర్రెలు, మేకల మందలు
- కోళ్ల ఎరువుకు డిమాండ్



చెర్లబుత్కూర్ శివారులోని పొలంలో గొర్రెల మంద

కరీంనగర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కోతలు ముగియకముందే వానాకాలం సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ముందుగా నేలను సారవంతం చేసేందుకు మూగజీవాల ఎరువును ఉపయోగిస్తున్నారు. పొలాల్లో గడ్డిఉండగానే కొందరు మేకలు, గొర్రెల మందలు పెట్టిస్తుండగా, మరికొందరు కోతలు అయిపోయాక గడ్డిని చుట్టి పశుగ్రాసానికి వినియోగిస్తుండగా, ఇంకొందరు తగలబెట్టి వర్షం కురిసిన తరువాత కలియ దున్నుతారు. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్ళ, కంపోస్టు, సేంద్రియఎరువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గుతుండడంతో రైతులు జీవాల ఎరువుల వాడకంపై దృష్టిసారిస్తున్నారు.

రైతులు తమ పొలాల్లో గొర్రెలు, మేకల మందలు పెట్టిస్తున్నారు. గొర్రెలు మేకలమూత్రంలో పీహెచ్ విలువ 7.7ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిద్వారా చౌడుభూముల సారవంతంగా మారుతాయి. లీటర్‌మూత్రంలో 9నుంచి 13గ్రాముల నత్రజని 17నుంచి 20గ్రాముల పొటాషియం, పాస్పరస్ వంటివి ఉంటాయి. ఒక గొర్రెద్వారా ఒక రాత్రికి లీటర్‌మూత్రం 380నుంచి 540గ్రాముల వరకు పేడ లభిస్తుంది. ఒక్కరాత్రి పొలంలో ఉంచేందుకు రూ.1000నుంచి 1500 వరకు కాపరులు తీసుకుంటున్నారు. గొర్రెలు, మేకలమంద ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు బాక్టీరియా, ప్రొటోజోవా, ఫంగి తదితర ఉపయోగకరమైన సూక్ష్మజీవులతో నేలసారవంతం అవుతుంది. పశువుల పేడ ట్రాక్టర్‌కు రూ.3,500నుంచి4వేల చొప్పున రైతులు కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుండటంతో రైతులు పశువుల ఎరువుల కోసం ఇప్పటి నుంచే అడ్వాన్సులు ఇస్తున్నారు.

లారీల్లో కోళ్ల ఎరువు సరఫరా..

కొన్నేళ్లుగా కోళ్లఫారాల నుంచి వచ్చేవ్యర్థాలను ఎరువుగా ఉపయోగించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాలోని పౌల్ట్రీలనుంచి కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఇప్పటి నుంచే రైతులకు లారీల చొప్పున సరఫరా చేస్తున్నారు. చిన్నలారీఅయితే రూ.20వేలు, పెద్దలారీ అయితే రూ.30వేల వరకు తీసుకుంటున్నారు.

కారు, ఆటో ఢీ..ఇద్దరికి గాయాలు

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల- కరీంనగర్ మార్గంలోని రాజారం సమీపంలో సోమవారం రాత్రి కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒక్కరికి, అదే సమయంలో అక్కడే ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తూ పడిపోవడంతో ద్విచక్రవాహనంపైగల మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వెలుతున్న కారు, జగిత్యాల వైపు నుంచి నూకపల్లికి వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జు కాగ డ్రైవర్ వేముల శివకు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన స్థలం నుంచే వెలుతున్న మల్యా లకు చెందిన బోగ రాజశేఖర్ ద్విచక్రవాహనం ప్రమాదవశత్తూ పడిపోవడంతో రాజశేఖర్‌కు గాయాలు అవడంతో గాయపడిన ఇద్దరినీ చికిత్సకోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవర్ పరారిలో ఉండగా పోలీసులు కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ షాపులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ఒక సెల్‌ఫోన్ షాపులో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో కొంత ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

అంజన్న హుండీ ఆదాయం రూ. 1.07కోట్లు



కొండగట్టులో హుండీల్లోని డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారారూ.1,07,67,134 ఆదాయం సమకూరినట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. 39రోజులకు గాను ఆలయంలోని 12హుండీలను విప్పి సోమవారం లెక్కించగా నగదుతోపాటు 134 విదేశీ కరెన్సీనోట్లు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, ప్రధానార్చకులు రామకృష్ణ, రఘు, అధికారులు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు. కాగాఇన్నాళ్లు హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ప్రస్తుతం వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్‌చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యంకు మంత్రి పదవి వచ్చేలా ఆంజనేయ స్వామి ఆశీర్వదించాలంటూ ఎమ్మెల్యే అభిమాని ఒకరు హుండీలో చీటీరాసివేశారు. సోమవారం హుండీల లెక్కింపు సందర్భంగా రూ.500 నోటుకు చీటిపిన్ చేసి ఉండడం సిబ్బంది గమనించారు.

● హుండీల లెక్కింపులో వాగ్వాదం

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా ఆలయ ఈవో, లెక్కింపునకు వచ్చిన సేవకుడి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. సేవకు వచ్చిన ఓ రిటైర్డ్ ఎంపీడీవో తదితరులతో సీసీ కెమెరాలో కనిపించే విధంగా లెక్కించాలని ఈవో సూచించి అక్కడినుంచి వెళ్లిపోయారు. కాసేపటికి పర్యవేక్షణలో భాగంగా మళ్లీ ఈవో వచ్చేసరికి రిటైర్డ్ ఎంపీడీవో అలాగే ఉండడంతో వారి మధ్య వాగ్వాదానికి దారితీసింది. అనంతరం సేవకు వచ్చిన ఆ రిటైర్డ్‌ఉద్యోగిని అక్కడి నుంచి పంపివేయడంతో గొడవ సద్దుమణిగింది.

ఈదురుగాలులు..వర్షం

- విరిగిపడ్డ చెట్లు
- నిలిచిపోయిన విద్యుత్‌సరఫరా
- ఆముదాలపల్లి, మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన



కేశవపట్నంలో నేలకూలిన విద్యుత్ స్తంభం



వంకాయగూడెంలో జాతీయ రహదారిపై విరిగిపడ్డ చెట్టు

శంకరపట్నం/హుజూరాబాద్/గంగాధర, మే 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులకు వంకాయగూడెం, తాడికల్ గ్రామాల్లో జాతీయరహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముత్తారం, మొలంగూర్ గ్రామాల్లో రెండురేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయి. ఆముదాలపల్లిలో ఓవ్యక్తి ఇంటి ఎదుట ఉన్న తాడిచెట్టిపై పిడుగుపడి మంటలు అంటుకున్నాయి. ఆముదాలపల్లి మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది.

హుజూరాబాద్, గంగాధర మండలాల్లో సైతం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. అకాలవర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కాపాడుకు నేందుకు రైతులు ఇబ్బందులుపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు కిరాయికి తెచ్చుకొని ధాన్యంపై కప్పారు. లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి గ్రామాల్లో గోలీకాయల సైజులో వడగళ్లు పడ్డాయి. రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

సుల్తానాబాద్: మండలంలోని కదంబాపూర్‌లో సోమవారం వీచిన గాలులకు అభినందన రైసుమిల్లుల గోదాములు ధ్వంసమయ్యాయి. గోదాముల రేకులు ధ్వంసం కాగా మరికొన్ని గాలిలో ఎగిరిపోయాయి. సత్యగణేష్ ఇండస్ట్రీస్ గోదాములు రైస్‌మిల్లు గోదాములు కూడా దెబ్బతిన్నాయి. సుద్దాల, కదంబాపూర్ గ్రామాలల్లో తోటల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మార్కర్ నిటారుగా ఉన్నా కనిపించని నీడ

మిట్ట మధ్యాహ్నం నీడమాయం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఖగోళ అద్భుతంతో సోమవారం నుంచి ఈ నెల 14 వరకు మిట్ట మధ్యాహ్నం మనిషి నీడ రెండు నిమిషాల పాటు కనిపించదని ఆస్ట్రాయిడ్స్ సెర్చ్ క్యాంపెయిన్ కన్వీనర్ ఓదెలు కుమార్ తెలిపారు. మంగళవారం దీనికి సంబందించిన వివరాలు వెల్లడించారు. మిట్ట మధ్యాహ్నం నీడ మాయమవడాన్ని జీరో షాడోగా వ్యవహరిస్తారన్నారు. సాధారణంగా నీడ మనిషికి ఏదో ఒక పక్క కనిపిస్తుందని, సోమవారం నుంచి 14 వరకు మాత్రం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యకాంతి మన మీద లంబంగా పడి నీడ కనిపించదని వివరించారు. భూమి అక్షం 23.5 డిగ్రీలు వంపుగా ఉన్నందున సూర్యుడి చుట్టూ భ్రమణం చేసే సమయంలో సూర్యుడి స్థానం ఉత్తర-దక్షిణ దిశలో మారుతూ ఉంటుంది. ఏటా రెండు సందర్భాల్లో కర్కాటక, మకర రేఖల మధ్య ఉన్న ప్రదేశాల్లో మధ్యాహ్నం సమయంలో సూర్యకిరణాలు భూమిపై సంపూర్ణ లంబంగా పడతాయి. దీంతో నిలువు వస్తువుల నీడ రెండు నిమిషాల వరకు పూర్తిగా మాయమవుతుందన్నారు. ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యుడి కదలిక, స్థానాన్ని, అధ్యయనం చేసేందుకు జీరో షాడో ఉపకరిస్తుందని తెలిపారు.



ఓదెలు కుమార్



ఎస్సెస్సీ మార్కుల పునఃపరిశీలనకు అవకాశం

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు చాన్స్

వెల్గటూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని అనిపించిన విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు మార్కులను పునఃపరిశీలన చేయడానికి ప్రభుత్వ పరీక్షల విభాగం అవకాశం కల్పించింది. చాలా మంది విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వలన పరీక్షల విభాగం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 38,498 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 37,667 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 831 మంది విద్యార్థులు పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మార్కుల పునః పరిశీలన కోసం ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలు

జిల్లా	విద్యార్థులు	ఉత్తీర్ణులు	అనుత్తీర్ణులు
జగిత్యాల	11849	11636	213
కరీంనగర్	12508	12245	263
పెద్దపల్లి	7387	7157	230
రాజన్న సిరిసిల్ల	6754	6629	125

రీ కౌంటింగ్

విద్యార్థులు ఎన్ని సబ్జెక్టుల్లో మార్కులు రీ కౌంటింగ్ చేసుకోవాలని కోరుకుంటారో వాటికి ఒక్కో సబ్జెక్టుకు రూ. 500 ఫీజు చెల్లించాలి.

దరఖాస్తుకు ఈనెల 15 వరకు గడువు

విద్యార్థులు ఈనెల 15లోగా నిర్ణీత రుసుము చెల్లించి మార్కుల లెక్కింపుతో పాటు జవాబు పత్రాల పునఃపరిశీలన చేయించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్టుకు రూ.500లు ఎస్‌బీఐ బ్యాంక్‌లో చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా జవాబు పత్రాలను పొందడంతో పాటు తక్కువ మార్కులు వచ్చినట్లు గుర్తిస్తే మళ్లీ అదనంగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మార్కుల రీ కౌంటింగ్ దరఖాస్తులను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం హైదరాబాద్‌కు నేరుగా కానీ లేదా పోస్టు ద్వారా గానీ పంపించవచ్చు.



దరఖాస్తులను పరీక్షల విభాగం వెబ్‌సైట్ నుంచి తీసుకొని వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులను మాత్రమే లెక్కించి ఎక్కువ మార్కులు వస్తే సరి చేస్తారు. లేకుంటే మార్కులు అలాగే ఉంటాయి. జవాబు పత్రాలను చూసుకునే అవకాశం ఇందులో ఉండదు.

ఫీజుల వివరాలు

రీవెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రీ వెరిఫికేషన్‌లో విద్యార్థులు తాము రాసిన జవాబు పత్రాల జిరాక్స్ కాపీలను పొందవచ్చు. దీని వలన తాము రాసిన సమాధానాలకు మార్కులు సరిగా పడ్డాయా? లేదా? మార్కులు ఎన్ని వచ్చాయో చూసుకునే అవకాశం ఉంటుంది. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే మళ్లీ మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. రీ వెరిఫికేషన్‌కు హాల్ టికెట్ జిరాక్స్ కాపీ, కంప్యూటరైజ్డ్ ప్రింటెడ్ మెమోతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేయాలి. ఎస్సెస్సీ బోర్డుకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా గానీ పంపిన దరఖాస్తులు ఆమోదించబడవు. ప్రధానో పాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిగత చలాన్ ద్వారా ఫీజు చెల్లించాలి. రీ వెపికేషన్‌కు విద్యార్థులు ఈనెల 15 వరకు సంబంధిత ప్రధానో పాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని జగిత్యాల డీఈవో రాము సూచించారు.

వేములవాడలో భక్తుల రద్దీ

50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకరా.. అనే నామస్మరణతో రాజన్న ఆలయం సోమవారం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తెల్లవారు జామున ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు నాలుగు గంటలు క్యూలైన్‌లో నిరీక్షించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీబద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు చేసి డప్పుచప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం కావడంతో 50 వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్లు అంచ నా వేస్తున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలె త్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్ సూపరింటెంట్ వరి నర్సయ్య, నరేందర్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, గిరి, రాజే శంలు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న సింగర్ మానుకోట ప్రసాద్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని సింగర్ మానుకోట ప్రసాద్ దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఫోక్ సింగర్ ప్రసాద్ రాజన్న ఆలయ చరిత్రపైన నూతన పాటను చిత్రీకరించి త్వరలో విడుదల చేస్తున్న సందర్భంగా రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదం అందజేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

కోనరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి గ్రామంలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికీ నెలరోజులు గడిచినా 2,000 కింటాళ్ల మాత్రమే తూకం వేశారని మరో 20 వేల క్వింటాళ్ల కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. వర్షాకాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో వెంటనే లారీలను తెప్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రైతులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన గొల్లపల్లి రైతులు

- రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలి..
- తెలంగాణలో జరిగింది కుల గణన సర్వే... కేంద్రం చేసేది కుల గణన...
- రాజీవ్ రహదారి కాంట్రాక్టు గడువు పొడిగింపునకు యత్నిస్తే వ్యతిరేకిస్తా...
- తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12లక్షల కోట్లు ఇచ్చింది...
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కులగణనతో బీసీలకు న్యాయం

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): కుల గణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. సోమవారం ఎన్‌టీపీసీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం చేపట్టనున్న కులగణనకు రాష్ట్రం చేసిన కుల గణన సర్వేకు పొంతన లేదన్నారు. రాష్ట్ర సర్వేలో కేవలం 50శాతం ప్రజలను మాత్రమే సర్వే చేశారన్నారు. కేంద్రం చేసేది కుల గణన అని, ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్ ప్రకటించామని చెబుతున్నా అందులో 10శాతం ముస్లింలకు ఇచ్చారని, ఇక బీసీలకు ప్రతిపాదించింది 32 శాతమేనన్నారు.



మావోయిస్టుల మెప్పు పొందేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లు పోటీ పడుతున్నారని, రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నే మావోయిస్టులను నిషేధించిందన్నారు. పదేళ్ల అధి కారంలో ఉన్న కేసీఆర్ ఆ పార్టీపై ఎందుకు నిషేధం ఎత్తివేసి చర్చలు జరుప లేదని ప్రశ్నించారు. మావోయిస్టు పార్టీతో మాటలు లేవు, మాట్లాడుకోవడాలు కూడా లేవని ఆయన తేల్చి చెప్పారు. వారు బేషరతుగా తుపాకులు వీడి లొంగిపోవాలన్నారు. రాష్ట్రంలో పీపుల్స్‌వార్ పార్టీ, మావోయిస్టులు అనేక విధ్వంసాలకు పాల్పడ్డారని, ఎంతో మంది ప్రజా ప్రతినిధులను, నాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు.

చంద్రబాబుపై అలిపిరిలో దాడి చేశారని, అప్పటి హోం మంత్రి మాధవరెడ్డిని పొట్టనపెట్టుకున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నర్సిరెడ్డి, నల్గొండ జిల్లాలో ఎమ్మెల్యే రాగ్యానాయక్, కరీంనగర్ జిల్లాలో మాజీ మంత్రి శ్రీపాదరావు, మల్హర్‌రావులను హత్య చేశారన్నారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ గురించి మాట్లాడుతున్న హరగోపాల్, వరవరరావులు అంత్యక్రియల్లో శవాలను మోయడం తప్ప ఏం సాధించారో చెప్పాలన్నారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలపై దాడి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఆదివాసీలు వేరు, మావోయిస్టులు వేరు అన్నారు. ఆదివాసీలకు తుపాకి హింసతో సంబంధం లేదని, వారెన్నడూ ప్రభుత్వంపై తిరగబడలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పదేళ్లల్లో రూ.12 లక్షల కోట్ల నిధులను ఇచ్చిందన్నారు. జాతీయ రహదారులకు 1.2 లక్షల కోట్లు, రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ల ఆధునీ కరణకు రూ.32వేల కోట్లు కేటాయించారని, ధాన్యం కొనుగోలుకే 1.5లక్షల కోట్లు ఇచ్చిందన్నారు.

రాజీవ్ రహదారిని అప్పగిస్తే నేషనల్ హైవేగా అభివృద్ధి చేస్తామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే సంబంధిత కాంట్రాక్టర్‌ను ఒప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజీవ్ రహదారి కాంట్రాక్టర్‌కు గడువును పొడిగించేందుకు కేంద్రం సహక రిస్తుందనేది అబద్ధమని, అలాంటి చర్యలను రాష్ట్రం ప్రతిపాదిస్తే ప్రజలు వ్యతి రేకిస్తారన్నారు. రామగుండంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి గురించి తనకు సమాచారం లేదని, కరీంనగర్ కు మాత్రం ఈఎస్‌ఐ ఆసుపత్రి మంజూరైం దన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కందుల సంధ్యారాణి, మేరుగు హన్మం తుగౌడ్, బల్మూరి వనిత, కోమళ్ల మహేష్, సోమారపు లావణ్య, ధర్మపురి, క్యాతం వెంకటరమణ, బల్మూరి అమరేందర్‌రావు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ఆదివాసీ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

- నా విప్లవ బంధం తెగిపోయినా ఆదివాసీ బంధం తెగిపోలేదు
- హింసను ప్రేరేపించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రాహుల్ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన

ధర్మారం, మే 5 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమంతో తనకు బంధాలు తెగిపోయినా, అదివాసీయుల పేగు బంధం తెగిపోలేదని, ఆదివాసీ ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతియుత వాతవరణం నెలకొల్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ధర్మారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ బిడ్డలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకుండా ఆదివాసి ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతి వాతావరణం నెలకొల్పడం ఈ రాష్ట్రంతో పాటు దేశానికి అవసరమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సంక్షేమం - అభివృద్ధి రెండు కళ్లలాంటివని, సంక్షేమాన్ని మరువకుండా అభివృద్ధిని విస్మరించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన చేపట్టారని, అందుకు తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణతోపాటు పేదలకు లబ్ది జరిగే సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగులను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోపే 60 వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకుందన్నారు. ధర్మారం తెనుగువాడ నుంచి ఎండపల్లి ఎక్స్ రోడ్డు వరకు సీఆర్ఆర్ గ్రాంటు నుంచి 3 కోట్ల 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, ఖిలావనపర్తిలోని పోచమ్మ ఒర్రె వద్ద సీఆర్ఆర్ గ్రాంటు నుంచి కోటి 25 లక్షల వ్యయంతో పనులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వానికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికి ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి పథకాలు పేద ప్రజల కోసం చేపడుతున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై అవగాహన ఉందని, ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ బడులకు సెలవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ సింగ్, కలెక్టర్ కోయా శ్రీహర్ష, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏఈ రాజశేఖర్, అనుదీప్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

పెగడపల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని కీమలాటపల్లిలో సోమవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలసి మంత్రి సీతక్క రూ.20 కోట్ల నిధులతో చేపట్టనున్న నియోజకవర్గ పరిధి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ. 20 కోట్ల సీఆర్ఆర్ నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. విడతల వారీగా మరో 30 కోట్లు మంజూరుకు మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం మండలంలోని నార్సింహానిపేట గ్రామంలో తాండ్ర లక్ష్మి అనే పేదింటి మహిళ ఇంట్లో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసిన సన్న బియ్యం భోజనాన్ని మంత్రి సీతక్క, అధికారులు, గ్రామస్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, సాగు, తాగు నీటి అవసరాల కోసం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమాలలో కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీఆర్‌డీవో రఘువరన్, డీపీవో మదన్‌మోహన్, డీడబ్ల్యుఓ నరేష్, పంచాయతీ రాజ్ సీఈ సమత, ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింహానిపేటలో లబ్ధిదారు ఇంటిలో భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

శ్వాస అందక ఉక్కిరిబిక్కిరి

- రోజురోజుకు పెరుగుతున్న ఆస్తమా బాధితులు
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

సుభాష్ నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక శ్వాస సంబంధ వ్యాధుల్లో ఆస్తమా ఒకటి. ఊపిరితిత్తుల్లోని వాయునాళాల్లో వివిధ కారణాలతో కండరాలు వాచిపోతాయి. దీంతో ఆ నాళాలు సన్నగా మారుతాయి. ఇది శ్వాసకు ఆటంకంగా మారుతుంది. ఏదైనా చిన్న పని చేసినా ఆయాసం వస్తుంది. ఆస్తమా తీవ్రంగా మారితే పరిణామాలు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 262 మిలియన్ల మంది ఆస్తమాతో ఇబ్బంది పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) అంచనా ప్రకారం మనదేశంలో 3.4 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉబ్బసం గురించి అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మే మొదటి మంగళవారం రోజు ప్రపంచ ఆస్తమా దినోత్స వాన్ని నిర్వహిస్తారు. డబ్ల్యుహెచ్‌వో ఆధ్వర్యంలో 1998 నుంచి ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



ఈ సంవత్సరం థీమ్....

ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక థీమ్ తీసుకుంటారు. ఈ సంవత్సరం 'ఇన్‌హెల్డ్ ట్రీటెమెంట్స్ అందరికి అందుబాటులో ఉండేలా చేయండి' అనే థీమ్‌ను తీసుకున్నారు. ఇన్‌హెల్డ్ కార్టికోస్టెరాయిడ్స్ వంటి అవసరమైన ఆస్తమా మందులపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ఉద్దేశం.

చికిత్సతో ఆస్తమా తగ్గించవచ్చు

డాక్టర్ సుమలత, చెస్ట్ ఫిజీషియన్



ఆస్తమా వ్యాధి సరైన చికిత్సతో తగ్గిపోతుంది. ఆస్తమా ఉన్నవారు దుమ్ము ధూళికి ఉండాలి. బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. పొగ తాగవద్దు. శీతల పానియాలు, అల్కాహాల్ సేవించవద్దు. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు జాగ్రత్త వహించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అస్తమా లక్షణాలు కనిపించిన వెంటనే ఛాతి వ్యాధి నిపుణులను సంప్రదించాలి. వారి సలహాల మేరకు మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

లక్షణాలు, నివారణ

ఆస్తమా లక్షణాలు క్రమక్రమంగా బయటపడతాయి. తరుచుగా అలసట, దీర్ఘకాలిక జలుబు, కాలనుకూలంగా అలెర్జీలు వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఆస్తమా ఉన్న వారు వాయు కాలుష్యం, చల్లని గాలి, సువాసనలు మొదలైన వాటికి దూరంగా ఉండాలివ. సిగరెట్లు, కొవ్వొత్తులు, ధూపం, బాణసంచా నుంచి వచ్చే పొగను పీల్చొద్దు. జలుబు లేదా ఫ్లూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి. పరిసరాలను దుమ్ము ధూళి లేకుండా చూసుకోవాలి. మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.



వేసవి శిబిరం ప్రారంభం

ధర్మపురి, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ (బాలికల) లో యంగ్ ఇండియా వారిచే నిర్వహించే విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆయన సతీమణి కాంతా కుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. 15 రోజుల పాటు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు వేసవి శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఎంఈవో సీతాలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, విజ్ఞాన శాస్త్రం, నైతిక, సామాజిక విలువలు, చిత్రలేఖనం మొదలగు అంశాలపై ప్రాథమిక పరిజ్ఞానాన్ని కల్పించడానికి నిష్ణాతులైన, నిపుణులైన ప్రభుత్వ ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు శిక్షణ శిబిరం కో ఆర్డినేటర్ రావులపెల్లి శ్రీనివాస్‌ను 9121395356 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొలిచాల శ్రీనివాస్, టీచర్లు రావులపెల్లి శ్రీనివాస్, బోగ శివప్రసాద్, సంగనభట్ల సంజీవ్ పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మెట్‌పల్లి రూరల్, మే, 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు చక్రపాణి వామనాచార్యుల వేదమంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలి

రాయికల్, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం పొలాస శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని రైతు వేదికలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. అవసరం లేకుండా పురుగు మందులను వాడొద్దని పేర్కొన్నారు. రైతులు గట్లపై పండ్ల చెట్లు, వివిధ రకాల చెట్లను పెంచుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. విత్తనాలను వారి పొలంలో నుంచే తీసుకోవాలని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు ఎరువులను తీసుకున్న సమయంలో రశీదును భద్రపరుచుకోవాలని, పంట నష్టం జరిగితే రశీదు ద్వారా నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రవి, బి శ్రీనివాస్, ఏవో ముక్తేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

అకాలవర్షంతో అన్నదాతకు నష్టం

-నేలరాలిన మామిడి -కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

కోరుట్ల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో సోమవారం ఈదురుగాలులతో అకాలవర్షం కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉరుములు మెరుపులతో బారీ వర్షం కురవడంతో రైతన్నకు మరోమారు చేదు అనుభవం చోటు చేసుకుంది. గత వారం రోజుల నుండి వీస్తున్న గాలికి తోడు సోమవారం వీసిన బారీ ఈదురు గాలీతో మామిడి పూర్తి స్థాయిలో నేల రాలడంతో మామిడి రైతులు పూర్తిగా నష్టపోయారు. అన్ని గ్రామాలలోని వరిదాన్యం కొనుగోలు కేంద్రాలలో వర్షం నీరు నిండి పోయి దాన్యం నిలువలు నాని పోయ్యాయి. పలు కేంద్రాలలో దాన్యం నిలువలపై ఉన్న టార్పిన్ పత్రాలు గాలికి లేచిపోడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోన్నారు. చేతికందిన నువ్వు పంట పూర్తిగా నేల రాలడంతో నువ్వు రైతు పూర్తిగా నష్టపోయాడు. రాత్రి సమయంలో తీవ్ర గాలి వీయడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడింది. అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో కోరుట్ల పట్టణ ప్రజలు, మండలంలోని గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కోన్నారు.

●వెల్గటూర్: వెల్గటూర్ మండలంలో కొన్ని చోట్ల కురిసిన వడగండ్ల వాన అన్నదాతలను ఆందోళనకు గురి చేసింది. ధాన్యం కేంద్రాల వద్ద ఉన్న వారు కుప్పలపై కవర్లు కప్పుకున్నారు. ఇళ్ల వద్ద ఉన్న వారు ఉరుకులు పరుగుల మీద కొనుగోలు కేంద్రాలకు చేరుకున్నారు. ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా చేసి కవర్లు కప్పుకునే సరికి ధాన్యం కొంత మేర తడిసింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఎక్కడ వర్షార్పణం అవుతుందదోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం వచ్చిన ధదాన్యాన్ని వెంటది వెంట కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కోటిలింగాల కమాన్ దగ్గర చెట్టు గాలికి విరిగి పడింది.


కోరుట్లలో తడిసిన ధాన్యం


కోటిలింగాలలో కూలిన చెట్టు

●రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని భూపతిపూర్, రామాజీపేట, కుమ్మరిపెల్లి, అల్లీపూర్, కొత్తపేట తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురుగాలుతో కూడిన వర్షం పడింది. ఈదురు గాలులకు మామిడి నేల రాలింది.

●కొడిమ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలితో కూడిన వడగళ్ళ వర్షం కురిసింది. మండలంలోని చెప్యాల, పూడూర్, నల్లగొండ, కొడిమ్యాల గ్రామాల్లో వడగళ్ళు కురిసాయి.

వడగళ్ళ వర్షం కురవటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. ఈదురుగాలికి పూడూర్‌లో మామిడి కాయలు నేలరాలాయి.

కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మూడవ రోజు సోమవారం శ్రీ నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సామవేద పారా యణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల, స్థాపిత దేవతా పూజలు, సహస్ర వరుణ, కలశ స్థాపన, స్థాపిత దేవత హోమాలు నిర్వహించారు. దేశంలో దుర్భిక్ష నివారణ కోసం, సువృష్టి ప్రాప్తికై, సకల ఈతి బాధల నివారణ, అనువాహక హోమాలు నిర్వహించారు. సాయంత్రం వేళలో కూడ కలశ పూజలు, అర్చనాది ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లోక కళ్యాణార్థం సుదర్శన, నారసింహ హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీహెచ్ రమణయ్య, నరసింహ మూర్తి, నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి


మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, మే,5 (ఆంధ్రజ్యోతి) : పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల అధికారుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులు ఎజెండాలోని అంశాలను చదివి వినిపించగా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న అధికారుల తీరు మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డీఈ రమణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆనంద్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఇబ్రహీంపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

మెట్‌పల్లిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ప్రజలకు మంచినీటి సమస్య రాకుండా చూడాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. ఇబ్రహీం పట్నం మండలం డబ్బా గ్రామంలోని మిషన్ భగీరథ పంపును సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

●మల్లాపూర్, మే, 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 69 మందికి కల్యాణలక్ష్మి, 20మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాయికల్, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉపవైద్యాధికారి ఎన్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని అయోధ్య, అల్లీపూర్ గ్రామాల్లోని పల్లె దవాఖానాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుబయట పని చేసేవ్యక్తులు ఉదయం 11 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాతనే చేసుకోవాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని, పిల్లలు, వృద్ధులు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో సాగర్ రావు, సూపర్‌వైజర్‌లు శ్రీనివాస్, ఇల్లెందుల శ్రీనివాస్, ఉమారాణి పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

మేడిపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకుడు డా, కాయితి శంకర్‌ను మాల సంక్షేమ సంఘం మేడిపల్లి వారు సన్మానించారు. శంకర్‌కు మెక్సికో (అమెరికా) టొలాసా యూనివర్సిటీ సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా శంకర్‌ను సంఘం సభ్యులు సన్మానించారు.

సర్కారు బడిని సద్వినియోగం చేసుకోవాలి

కథలాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని సర్కారు బడులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించి వీధుల వెంట ర్యాలీ చేపట్టారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఊరూరా నిఘా కమిటీలు

(ఐదో పేజీ తరువాయి)

వేయాలని యోచిస్తున్నారు. అందులో ఎస్సీ, ఎస్టీలతో పాటు గ్రామంలోని ఒక యువకుడికి, సామాజిక తనిఖీపై అవగాహన ఉన్న మహిళలు, సీనియర్ సిటిజన్ లేదా అంగన్‌వాడీ టీచర్లను సభ్యులుగా చేర్చుకోవాలని ప్రతిపాదన చేస్తున్నారు. ఈ సభ్యుల కాలపరిమితి ఆరు నెలలు మాత్రమే ఉంటుందంటున్నారు. గ్రామపంచాయతీల్లో తీసుకునే అన్ని తీర్మానాల్లో కమిటీ సభ్యుల ప్రాతినిధ్యం కచ్చితంగా ఉండాల్సిందే. ఉపాధిహామీ పథకాల అమలులో, కార్మికుల కూలి చెల్లించడంలో ఏదైనా అవకతవకలు జరిగినా, కూలీలను మోసగించినా ఈ కమిటీ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

పకడ్బందీగా పనులు నిర్వహిస్తున్నాం

-రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామాల్లో పకడ్బందీగా ఉపాధి పనులు నిర్వహిస్తున్నాం. ప్రతీ రోజు ఉన్నతాధికారుల పర్యవేక్షణ జరుగుతోంది. ఎలాంటి అక్రమాలకు చోటివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిఘా కమిటీల ఏర్పాటుతో పటిష్ఠంగా పనులు జరిగే అవకాశాలున్నాయి.

ఫార్మసీ ఆఫీసర్ల సంబరాలు

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్టులను ఫార్మసీ ఆఫీసర్లుగా పేరు మారుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్టుల సంఘం (టీజీపీఏ) ఆధ్వర్యంలో ఫార్మసిస్టులు సంబరాలు నిర్వహించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో ఫార్మసిస్టులు ఉత్తర్వుల ప్రతులను ప్రదర్శిస్తూ సంబరాలు చేశారు. టీజీపీఏ ఉపాధ్యక్షుడు చిలువేరి ఉదయ్ ప్రసాద్, జిల్లా కార్యవర్గం చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ అనూజు కుమార్, జిల్లా వ్యాక్సీన్ స్టోర్ ఫార్మసీ ఆఫీసర్ ఎండి జంషెద్ అలీ, ఫార్మసీ ఆఫీసర్ జిల్లా స్టోర్స్ గిరిధర్, సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యా మరియు ఆరోగ్య శాఖధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్‌కు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ ఎన్ శ్రీనివాస్, డాక్టర్ అర్చనలను శాలువాలతో సన్మానించారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం నియమించిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం ఉదయం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి ఆధ్వర్యంలో కమిటీ చైర్మన్ అంబాసిడర్ డా.బీఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, గుగ్గిల్ల రవిగౌడ్, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల సీఎంను కలిశారు. సమగ్ర ఎన్నారై పాలసీతో కూడిన గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయడానికి తమ కమిటీ అధ్యయనం చేసి నివేదిక తయారు చేస్తుందని డా. వినోద్ అన్నారు.

చైన్‌స్నాచింగ్‌కు యత్నం

మల్యాల, మే 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని ఘాట్‌రోడ్డుపై నడుచుకుంటు వెలుతున్న ఓ భక్తురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పుస్తెలతాడు అపహరణకు యత్నించారు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలం సాతారంకు చెందిన ఓర్సు వనజ సోమవారం అంజన్న దర్శనం చేసుకొని కాలినడకన ఘాట్‌రోడ్డు మీదుగా కొండ దిగువకు తన కొడుకులతో కలిసి వస్తుంది. కారులో వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వనజ మెడలోని పుస్తెలతాడు అపహరణకు యత్నించగా ఆమే కిందపడిపోగా కిందపడిన పుస్తెలతాడును తీసుకుంటున్న క్రమంలో దుండగులు కారులో పారిపోయారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు వస్తే అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అన్నారు.

కోరుట్ల వాసికి డాక్టరేట్

కోరుట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణానికి చెందిన కోల రమేష్ వివిధ పరిశోధన ద్వార ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ఓయు విద్యా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ పారిపల్లి పర్యవేక్షణలో "సెల్ఫ్ ఎస్టీమ్ అండ్ కోపింగ్ స్ట్రాటజీస్ అఫ్ స్టూడెంట్స్ ప్రిపేరింగ్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఇన్ తెలంగాణ స్టేట్ ఎస్టడీ" అనే పరిశోధన గ్రంథాన్ని యునివర్సిటీకి సమర్పించాడు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌లు రమేష్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులను అభినందించారు.

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

ధర్మపురి, మే 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం రహదారి వద్ద రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసూరి అనసూయ అలియాస్ సీతక్కకు సోమవారం సాయంత్రం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ జక్కు రవీందర్ మంత్రి సీతక్క, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

●ఎండపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజారాంపల్లి గ్రామం వద్ద పంచాయతీరాజ్ శాఖ మంత్రి దాసరి అనసూయ (సీతక్క) కు పెగడపల్లి మండలంలోని పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వెళ్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆమెకు టపాకాయలతో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మద్దుల గోపాల్ రెడ్డి, తాటిపర్తి శైలెందర్ రెడ్డి, గుండాటి జితెందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోరుట్ల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైడిమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరం పదవ తరగతి విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు సోమవారం గ్రామంలోని అపూర్వ సమ్మేళనంగా ఏర్పాడ్డారు. గ్రామంలోని ఓ కళ్యాణ భవనంలో అపూర్వ సమ్మేళనంగా ఏర్పాడి వారి పిల్లలతో ఉల్లాసంగా గడిపారు. వారు చిన్నానాటు చేసిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యా బోధనలు చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రతి వారం వారి వారి ఉంటున్న ప్రాంతాలలో మొక్కలు నాటి వారి పెర్లను ట్యాగు చేసే విధంగా తీర్మాణం చేసుకున్నారు. ప్రస్తుం వారు చేస్తున్న ఉద్యోగ, వ్యాపార వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జి మృతికి నివాళి

కోరుట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు సిటింగ్ జడ్ గిరిజా ప్రియదర్శిని విధులు నిర్వహిస్తూ అకాల మృత్యువాత పోందంగా అమెకు కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్వర్యంలో ఘన నివాళిని అర్పించారు. పట్టణంలోని కోర్టులో న్యాయవాదులు అమె ఆత్మకు శాంతి కలుగాలని కొరుతూ రెండు నివిషాలు మౌనం పాటించారు. న్యాయవాదులు తీవ్ర దిగ్భ్రాంతిని ప్రకటించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్ మాట్లాడారు. ఉమ్మడి కరీనంగర్ జిల్లా జడ్జ్‌గా గిరిజా ప్రయదర్శిని న్యాయవాదుల పట్ల ఎంతో గౌరవభావంతో వ్యవహరించారని వారి సేవలు చిరస్మరణీయంగా మిగిలి పోతాయలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఉరిడి సరేందర్, గాందారి శ్రీనివాస్, మద్దుల రోజా, వంగళ శ్రీనివాస్, ఓర్సు రాములు, కుందారపు వివేక్‌లతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

●ధర్మపురి, మే 5 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని మృతి పట్ల ధర్మపురి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ గిరిజ ప్రియదర్శిని ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్జిగా ఉన్న కాలంలో ధర్మపురిలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేసినట్లు, ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్‌కుమార్, న్యాయవాదులు గడ్డం సత్యనారాయణరెడ్డి, జాజాల రమేష్, రౌతు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

●ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

బుగ్గారం ,మే 5 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం బుగ్గారం మండలంలోని యశ్వంతరావుపేట గ్రామంలో రెవెన్యూ సదస్సుకు విప్ లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి అప్పటికప్పుడే పరిష్కారం జరిగేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను మండల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్ష్మణ్ కుమార్ కోరారు.పైలెట్ మండలంలో సదస్సులు పూర్తయ్యాక, జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా అధికారులు సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్ భూ భారతి చట్టంపై రైతులు అవగాహన కల్పించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్,జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించారు, అదేవిధంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. రైతులకు పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత సమస్యలకు సంబంధించిన అర్జీలను కాకుండా రేపు కూడా అధికారులకు అందించవచ్చని పేర్కొన్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసిల్దార్ మాజీద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్, మాజీ జెడ్పీటీసి బాదినేని రాజేందర్, మండల ఉపాధ్యక్షులు నర్సాగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ బాపురెడ్డి, శంకర్, పాల్గొన్నారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న విప్ అడ్లూరి, కలెక్టర్ సత్య ప్రసాద్

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

మెట్‌పల్లిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణ అనుబంధ గ్రామమైన వెంకట్రావ్‌పేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ధాన్యంకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ కూడా ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, జెట్టి లక్ష్మన్, ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్లల వెంకటరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతి, విండో తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ


దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. భూ భారతి అవగాహన సదస్సులలో భాగంగా గత రెండు వారాలు ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారుల రద్దు చేయడంతో ఈసారి అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు.

చెరువు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

- గంగ పుత్రులు జగిత్యాల

జగిత్యాల పట్టణంలోని చింత కుంట చెరువులో చాపలు పట్టుకుని జీవిస్తాము. లింగం చెరువు నుంచి వచ్చే నాలాను కొందరు కబ్జా చేశారు. చెరువు నాలా కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోగలరు.

మా భూములను కాపాడండి

- నర్సింగపూర్ గ్రామస్థులు

మేము జగిత్యాల మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతులము, మాకు చాలా కాలం క్రితం సాగు చేసుకుని బ్రతకడానికి ప్రభుత్వం బీ1 పట్టాలు ఇచ్చి సాగు భూమిని అప్పగించింది. అయితే మా ఊరిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని అధికారులు నోటీసులు పంపించారు. భూమిని స్వాదీనం చేసుకుంటే మా పరిస్థితి ఏంటి.

● సంక్షిప్తం..

రాయికల్: రాయికల్ పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో సోమవారం వైద్యులు రెండు క్లిష్టమైన ఆపరేషన్లు చేశారు. మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన జ్యోతి అనే గర్భిణీ అత్యధిక బరువు, చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన ఉమ అనే గర్భిణీకి క్లిష్టమైన పరిస్థితుల్లో ఆపరేషన్ చేశారు. దీంతో ఇరువురికి కుమారులు జన్మించగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డి తెలిపారు. క్లిష్టమైన ఆపరేషన్లు చేసిన వైద్యురాలు ఒడ్నాల రజితను అభినందించారు.

మల్యాల: మండలంలోని మానాలలో గల బీరయ్య గుడి వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కోరగా మంజూరి చేయడమే కాకుండా వెంటనే ఏర్పాటు చేయడంతో సంఘ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీ శ్రీనివాస్‌గౌడ్, ముత్తయ్య, నరేశ్, తిరుపతి, విజయ్, నక్క అనిల్ పాల్గొన్నారు.

మల్యాల: ప్రొపెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను సోమవారం మండలంలోని రామన్నపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్తవేత్త డాక్టర్ రజనీకాంత్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్, కారుణ్యకుమార్, మంజుల, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు పొందడానికి రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దీపిక అన్నారు. సోమవారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని రైతు వేదిక కేంద్రంలో నమోదు ప్రక్రియను ప్రారంభించారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ క్రీడాకారులకు కొడిమ్యాల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, జగన్నాథ శంకర్ మల్లన్న హ్యూమన్ నెట్ వర్క్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు బింగి మనోజ్‌కుమార్ టీషర్టులను అందించారు. టీషర్టులతో పాటు బ్యాట్స్ కిట్స్, క్రీడా సామగ్రి అందించారు.